క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కాలభైరవ విగ్రహ చర ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : నగర శివార్లలోని శ్రీ కాలభైరవస్వామి ఆలయంలో ఆదివారం చర విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. ఎంఎస్ కొట్టాల కాలభైరవ పురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నగరానికి చెందిన అమృతవల్లి ప్రకాశ్ స్వయంగా తయారు చేయించిన శ్రీ కాలభైరవస్వామి ఉత్సవ మూర్తిని శాస్త్రోక్తంగా ఆలయ నిర్వాహకులు బాసట బాలాజీరావుతోపాటు అర్చకులకు అందజేశారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితోపాటు విగ్రహదాత అమృతవల్లి ప్రకాశ్ కుటుంబ సభ్యులు, పలువురు ధార్మిక వేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి



టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్యను సన్మానిస్తున్న దూదేకుల సంక్షేమ సంఘ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: దూదేకుల కులస్తులు రాజకీయంగా ఎదగాలని దూదేకుల సంక్షేమ సంఘ నాయకులు ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం నగరంలోని దూదేకుల భవన్‌లో టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమిష్టి పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గౌతమ్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నాగూర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ఇంటి స్థలాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సుంకేసుల చిన్నరాజా, కేశవులు, వెంకటప్రసాద్, అహ్మద్ హుసేన్, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ సండే స్కూల్ సంబరాలు



సండే స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న పిల్లలు

కడప కార్పొరేషన్: రక్షణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వరల్డ్ సండే స్కూల్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యేసు పిలుచుచున్నాడు ప్రార్థనా గోపురంలో పిల్లల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలు దేవుని మార్గంలో నడిచి సత్ప్రవర్తన కలిగి, సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ సునీల్, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం

కడప కార్పొరేషన్: జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలో కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడిమి, ఉక్కపోతకు జనం అల్లాడిపోతున్నారు. ఆదివారం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. ఈ చల్లటి వాతావరణం ప్రజలకు కాస్త ఉపశమనం కలిగించింది. రాబోవు నాలుగైదు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ఈ తరహా వాతావరణం నెలకొందని పలువురు భావిస్తున్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కడప అర్బన్: ఖాజీపేట మండలం భూమయ్యగారిపల్లె నుంచి మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వృద్ధుడు(70) అనారోగ్యంతో బాధపడుతుండగా స్థానికుల సహకారంతో 108లో కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) క్యాజువాలిటీలో చేర్పించారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అతను చనిపోయాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. అతనికి బంధువులు ఎవరూలేకపోవడంతో ఖాజీపేట పోలీస్ స్టేషన్ వారు కడపలోని శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. దీంతో వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శ్రీనాగుల వీరభద్రయ్య బ్రాహ్మణ అన్నదాన ట్రస్ట్ వారి సహకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం వృద్ధుని మృతదేహానికి అంత్యక్రియలను నిర్వహించారు. అంత్యక్రియల కార్యక్రమంలో శ్రీ కాశీ విశ్వనాథసేవా సమితి సభ్యులు ఆర్టీసి కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, ఆర్టీసి రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రెడ్డెయ్య, పుట్టా పురుషోత్తం, ట్రాఫిక్ కానిస్టేబుల్ దినేష్ జంబ, కరాటే మాస్టర్ దామోదరం, గుండ్ల కొండ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు చేశాం

ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల మేలు జరిగిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా 23 డివిజన్‌లోని బెల్దారి వీధి, బోరెడ్డి వీధుల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల,మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ వీధిలోకి రేషన్ పంపిణీ చేసే వాహనాలు రావడం లేదని డిప్యూటీ సీఎంకు తెలుపగా, ఆయన వెంటనే స్పందిస్తూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. షేక సాజిదా బేగం అనే మహిళ మాట్లాడుతూ తనకు ఇంటి స్థలం, ఇల్లు, వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా రూ.9.06లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేసింది. షేక్ తాజ్ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.8.57 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ గొడుగులు పంపిణీ చేశారు. కార్పొరేటర్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, రామ్మోహన్‌రెడ్డి, తోటక్రిష్ణ, సుభాన్ బాషా, వేణుగోపాల్ నాయక్, షఫీ, మియ్యా, అర్జున్, లక్ష్మినారాయణ, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



మాట్లాడుతున్న బి.లక్ష్మీరాజా

వైవీయూ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కోరారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం, సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఎం. విజయ్ కుమార్, పి. మహేష్‌బాబు, సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, చంద్ర ఓబులరెడ్డి, ప్రభాకర్, రాజశేఖర్ రాహుల్, దేవదత్తం, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కడప బాలోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప బాలోత్సవ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ ప్రతినిధి, పూర్వ ఎమ్మెల్సీ గేయానంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కళాశాలను సందర్శించింది. ఈనెల 11న కళాశాలలో బాలోత్సవంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించనున్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను ఈ బృందం స్వయంగా పర్యవేక్షించింది. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ శనివారం నిర్వహించనున్న బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కళాశాలలు, పాఠశాలలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం పిల్లలు చదువులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాని నుంచి బయటపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతైనా అవసరమన్నారు. పరిశ్రమలశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా పిల్లల్లో సృజనతోపాటు పోటీతత్వం పెరుగుతుందని, తల్లిదండ్రులు వారిని ఈ దిశగా ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు తగిన సహకారం అందించాలని సూచించారు. కన్వీనర్లు రాజశేఖర రాహుల్, లక్ష్మీరాజా, రచయిత రామసుబ్బమ్మలు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సంస్థ సభ్యులు వెంకట రామరాజు, నరసింహారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, వెంకట సుబ్బయ్య, యుగంధర్, త్రిమూర్తులురెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామకథకు రమణీయత కూర్చిన మొల్ల



మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి

కడప కల్చరల్ : మన జిల్లా ఆడబిడ్డ, తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్లమాంబ శ్రీరామ కథకు రమణీతను కూర్చారని తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి అన్నారు. ఆదివారం కడప నగరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆయన మొల్ల రామాయణ సౌందర్యం అనే అంశంపై ప్రసంగించారు. వాల్మీకి రామాయణానికి వందలాది అనువాదాలు వచ్చినా మొల్ల తన కవిత్వానికి ప్రత్యేకమైన రంగు, రుచితో తెలుగు పాఠకులకు అందజేసి తన ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల రామాయణ పద్యాలలో మల్లె పరిమళం ఉంటుందన్నారు. అనంతరం అవధాని మురళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రామమూర్తినాయుడు, సంయక్త కార్యదర్శి తుపాకుల నారాయణ, సాహితీవేత్త డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆటా..పాట అదుర్స్



కడప కల్చరల్: ఆదివారం ఆటవిడుపులో భాగంగా కడప నగర పరిధిలోని శిల్పారామంలో ప్రదర్శించిన ఆటా–పాట అదుర్స్ అనిపించాయి. కమలాపురం ఆర్కే డ్యాన్స్ అకాడమి సభ్యులు ప్రదర్శించిన నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పదేపదే వారు తమకరతాళ ధ్వనులతో చిన్నారులను ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పలు పాఠశాలల్లో అధిక ఫీజు వసూలు

– పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న

వైవీయూ : పదో తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీతో ఆగకుండా పరీక్ష ఫీజుల్లో కూడా దోపిడీకి పాల్పడుతుండటం బాధాకరమన్నారు. పదోతరగతి పరీక్ష ఫీజు రూ.125గా ప్రభుత్వం నిర్ణయిస్తే కొన్ని పాఠశాలలు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

మల్లేలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

చింతకొమ్మదిన్నె : మండలంలోని మద్దిమడుగు గ్రామంలో వెలసిన మల్లేలమ్మతల్లికి ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నకాంపల్లి సర్పంచ్ మల్లిఖార్జున యాదవ్ తన సొంత నిధులతో పంచాయతీ పరిధిలోని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన బోరు బావిలో తాగునీరు పుష్కలంగా పడటంతో నూతన మోటారును ఏర్పాటు చేశారు. ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రజలకు నీరు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడు, వెంకటయ్య, నీలకంఠారెడ్డి, లక్కిరెడ్డి రమణారెడ్డి, కువైట్ బాషా తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి అభిషేకం

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్ రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ఆవరణలో విందుభోజనాలు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు



భక్తుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్న కొండయ్య స్వామి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో ఆదివారం అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో కొండయ్య స్వామి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కొండయ్య స్వామిని దర్శించుకోగా, ఆయన చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం చెక్కభజన, కోలాటం కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాత్రి జబర్దస్త్ కార్యక్రమం, ఆర్కెస్ట్రా, పౌరాణిక నాటకాల ప్రదర్శన నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్‌ను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1978–79 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం టీటీడీ కళ్యాణ మండపంలో జరిగింది. ఇక్కడి పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో సెటిలైన వారంతా దాదాపు 43 ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలుచుకున్నారు. అప్పటి తమ ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్, ఉపాధ్యాయుడు కొవ్వూరు రాజగోపాల్‌రెడ్డిలకు పాదాభివందనం చేసి వారిని శాలువ కప్పి, జ్ఞాపిక, పూలమాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో ఈ వేడుకను జరుపుకొని అందరు గుర్తుగా ఫోటో తీయించుకున్నారు. పూర్వవిద్యార్థులు బివి.నాగప్రసాద్, రంగనాథ్, ప్రభాకర్‌రెడ్డి, శాంతారామ్, కుంభం పాములేటి, రశీద్‌ఖాన్ పాల్గొన్నారు.

7 నుంచి శాస్త్రీయ దృక్పథ ప్రచారం



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్

వైవీయూ: నవంబర్ 7 నుంచి 2024 ఫిబ్రవరి 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ ప్రచారం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలో జనవిజ్ఞానవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీవీరామన్ జయంతి వరకు పాఠశాలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చెకుముకి సంబరాలను ఈనెల 10న ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, రాజశేఖర్‌రాహుల్, జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రీడాపోటీల్లో ప్రతిభ



రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో ఫిజికల్ డైరెక్టర్

కడప స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 క్రీడా ఎంపికల్లో కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు చక్కటి ప్రతిభ కనబరిచారు. కళాశాల నుంచి వివిధ క్రీడాంశాల్లో పాల్గొన్న క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఫిజికల్ డైరెక్టర్ అరుణ తెలిపారు. వాలీబాల్ క్రీడాంశంలో వి. శ్రీనిఖిత, ఎం. అంజలి, త్రోబాల్‌లో జి. భాను, రెజ్లింగ్‌లో వి. శ్రీనిఖిత, నెట్‌బాల్‌లో పి. వెంకటేశ్వరి, హ్యాండ్‌బాల్‌లో ఎల్.ప్రసన్నలక్ష్మి, జి. పల్లవి, హాకీలో ఎం. ఇందిర, ఇ.హరిణిప్రసాద్, బాక్సింగ్‌లో పి. విజయదుర్గాదేవి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-19 జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-19 జూడో పోటీల్లో వి. శ్రీనిఖిత రజత పతకం సాధించినట్లు తెలిపారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జాతీయస్థాయి పోటీలకు కళాశాల విద్యార్థినులు ఎల్.ప్రసన్నకుమారి, జి.పల్లవిలు ఎంపికైనట్లు తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన తైక్వాండో సబ్‌జూనియర్ పోటీల్లో కళాశాల విద్యార్థిని సాజియా వైష్ణవి కాంస్యపతకం సాధించినట్లు తెలిపారు.

అధునాతన పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీకి ఆదరణ



ఫోటో, వీడియోగ్రాఫర్లతో ఫ్యాకల్టీ భూపాల్

కడప కల్చరల్ : ఫొటో, వీడియోగ్రఫీ రంగంలో రాణించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ప్రముఖ ఫొటోగ్రఫీ టెక్నిషియన్, ఫ్యాకల్టీ కెనాన్ భూపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.చంద్రారెడ్డి, కడప అసోసియేషన్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఆధునిక ఫొటో, వీడియో కెమెరాల నిర్వహణ, ఈ రంగంలో వస్తున్న మార్పుల గురించి, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు. ఉదయం వీడియోగ్రఫీపై, భోజనానంతరం ఫొటోగ్రఫీపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి సంస్థ ఉపాధ్యక్షులు జిలానీబాషా, కార్యదర్శి శివరామకృష్ణ, సహ కార్యదర్శి ప్రభులు కెనాన్ భూపాల్‌తోపాటు సీనియర్ ఫొటోగ్రాఫర్లు, సంఘం ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఫొటో, వీడియోగ్రాఫర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. నగరానికి చెందిన ప్రముఖ గ్యాస్ట్రో అండ్ లివర్ స్పెషలిస్టు కృష్ణకార్తీక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ సురేష్ బాబు తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, అన్వితారెడ్డిల వివాహ రిసెప్షన్ ఘనంగా జరిగింది. ఆదివారం స్థానిక రింగ్‌రోడ్డులోని డీఎస్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డిలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్, టీటీడీ బోర్డు సభ్యులు మాసీమబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

సమాజంపై అవగాహన అవసరం



విజేతలతో అధికారులు

వైవీయూ : సమాజంపై అవగాహన, బాధ్యత ఎంతో అవసరమని రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ఎస్. మాసూంబాషా పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని ఐఎంఏ సమావేశ మందిరంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ మాసూంబాషా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, ఖాదర్‌బాషా, జవహర్‌రెడ్డి, శ్రీనివాసులు, బాలగంగాధర్‌రెడ్డి, కిశోర్, అశోక్‌కుమార్, అజీముల్లా తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీగా వెళుతున్న యూనియన్ బ్యాంకు అధికారులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంకు వారు అవగాహన కల్పించారు. అనంతరం ఏడురోడ్లు, కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగ్లా, నెహ్రూ పార్కు మీదుగా మున్సిపల్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ×సే నో టు కరెప్షన్–కమిట్ టు నేషన్¥ అనేనినాదంతో అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ షేక్ బాష, సురేష్, వివిధ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 16వ డివిజన్ ఇందిరానగర్‌లో జూదమాడుతున్న ఆరుగురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు సీకేదిన్నె ఎస్ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.రూ.3200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఉచితంగా మందుల పంపిణీ

జమ్మలమడుగు : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుష్ యోగ మందులను ఆదివారం పంపిణీ చేశారు. పుష్యమి నక్షత్రం సందర్భంగా పిల్లలకు స్వర్ణ బిందు ప్రాసన మందు అందజేశారు.

రైతులను ఆదుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కరువు కోరల్లో చిక్కిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాలని కోరామన్నారు. కడప శివారు ప్రాంతం కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు నీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, గండికోట ప్రాజెక్టు ద్వారా పెన్నా నదికి నీళ్లు వదిలి ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట ద్వారా కేసీ కెనాల్‌కు నీళ్లు విడుదల చేయాలనికోరామన్నారు.